




మున్నేరు వరద గురించి కిషన్‌రెడ్డికి వివరిస్తున్న మంత్రి పొంగులేటి



మున్నేరు వరద



నగరంలో మున్నేరు వరద పెరుగుతుండడంతో బాధితులను నిద్రలేపి పునరావాస కేంద్రాలకు పంపిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మరోసారి మున్నేరు టెన్షన్

ఇటీవల భారీ వరదలతో ఖమ్మం నగరవాసులకు పీడ కలను మిగిల్చిన మున్నేరు మరోసారి కలవర పెట్టింది. శనివారం ఖమ్మం నగరంతోపాటు ఎగువన మహబూబాబాద్ జిల్లాలో భారీవర్షాలు కురవడంతో శనివారం రాత్రి మరోసారి మున్నేరు వరద వేగంగా పెరిగింది. ఈ క్రమంలోనే వాతా వరణశాఖ భారీ వర్షసూచన చేయడంతో మంత్రులు, అధికారులు సత్వరం స్పందించారు. మంత్రుల ఆదేశాలతో జిల్లా ఉన్నతాధికారులను వెనువెంటనే ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు మున్నేరు పరివాహకంలో అర్ధరాత్రి సైతం స్వయంగా పర్యటించారు. దాంతో ఒక్కసారిగా టెన్షన్ వాతావరణం నెలకొంది. దాంతో అటు అధికారులు, ఇటు బాధితులు రాత్రంతా కంటిమీద కునుకులే కుండా గడిపారు. మంత్రుల ఆదేశాలతో అధికా రులు హై అలర్ట్ ప్రకటించి అర్ధరాత్రి ముంపు కాలనీ లకు పరుగులు పెట్టారు. ఇళ్లలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు.

- మంత్రుల ఆదేశాలతో అర్ధరాత్రి నుంచే అధికారుల పరుగులు
- స్వయంగా రంగంలోకి దిగిన కలెక్టర్, మునిసిపల్ కమిషనర్
- అర్ధరాత్రి ఇంటింటికీ తిరిగి అప్రమత్తం చేసిన ఉన్నతాధికారులు
- పునరావాస కేంద్రాలకు 8,270 మంది తరలింపు
- అర్ధరాత్రి వరద బాధితుల వద్దకు డిప్యూటీ సీఎం భట్టి
- వరద తగ్గడంతో తెల్లవారుజామున ఇళ్లకు చేరిన బాధితులు

ఎగువన భారీ వర్షాలతో నదికి పెరిగిన వరద

ఖమ్మం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి)/ఖమ్మం సంక్షేమవిభాగం: మున్నేరుకు వరద రావటంతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు మున్నేరు పరివాహక ప్రాంతంలోని ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇందుకోసం నగరంలో మున్నేరుకు సమీప ప్రాంతంలో మహిళా కాలేజీలో 800, స్వర్ణ భారతి కళ్యాణ మండపంలో 100, రామన్నపేటలో 150 మంది, దానవాయిగూ డెంలో 50, ధంసలాపురంలో 200మందికి పునరావాసం కల్పించారు. ఇదిలా ఉండగా వరదతో దెబ్బతిన్న ఇళ్లను శుభ్రం చేసుకుంటున్న వరద బాధితులకు, సహకరిస్తున్న వారి బంధువులకు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేకంగా భోజనం పార్సిల్స్ ఏర్పాటు చేసి ప్రాంతాల వారీగా వాహనాలను ఏర్పాటు చేసి భోజనం పార్సిల్స్ పంపిణీ చేశారు. మహిళా కాలేజీ నుంచి 4,500, స్వర్ణ భారతి కళ్యాణ మండపం నుంచి 300, రామన్నపేట 1,100, ధంసలాపురంలో 2,300 మందికి 8,270 భోజ నాలను పంపిణీ చేశారు.

నేరుగా రంగంలోకి ఇద్దరు ఐఏఎస్‌లు..

భారీ వర్షాల సూచన నేపథ్యంలో వారం రోజుల క్రితం ఉన్న పరిస్థితు లను అంచనా వేసుకున్న జిల్లా ఉన్నతాధికారులు మంత్రుల ఆదేశాలతో చర్యలకు పూనుకున్నారు. అర్ధరాత్రి వేళ నేరుగా వారే ముంపు కాలనీలకు వెళ్లి స్థానికులను అప్రమత్తం చేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఓ వైపు నుంచి, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మరోవైపు నుంచి ప్రజ లను నిద్రలేపుతూ పునరావాస కేంద్రాలకు వెళ్లాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ధంసలాపురం, మోతీనగర్ వైపు నుంచి, కమిషనర్ అభిషేక్ అగస్త్య రామన్నపేట, బొక్కలగడ్డ, కాల్వొడ్డు ప్రాంతాల వైపు నుంచి అప్ర మత్తం చేసుకుంటూ ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తర లించారు. కాగా మరుసటిరోజు తెల్లారే వరకు పునరావాస కేంద్రాల్లోనే ఉన్న ముంపు కాలనీవాసులు ఆదివారం ఉదయం నుంచే మున్నేరు తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.



పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

అర్ధరాత్రి పునరావాస కేంద్రాలకు భట్టి

వాతావరణశాఖ రాష్ట్రానికి భారీ వర్ష సూచన చేయడంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి రంగంలోకి దిగారు. వెంటనే కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య లను అప్రమత్తం చేసి ముంపు ప్రాంతాల బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మహబూబాబాద్‌లో భారీ వర్షం పడితే మున్నేరు మళ్లీ ఖమ్మాన్ని ముంచెత్తే అవకాశం ఉన్న నేప థ్యంలో భట్టి హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చారు. అర్ధరాత్రి వేళ ఖమ్మానికి చేరుకున్న ఆయన నగరంలోని కాల్వొడ్డు ప్రాంతంలో ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడారు. వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం మున్నేరు బ్రిడ్జి వద్ద వరదను పరిశీలించారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకు ముంపు ప్రాంత ప్రజలకు స్వర్ణభారతి కళ్యాణ మండపం, మహిళా డిగ్రీ కళాశాల, ధంసలాపురం ప్రభుత్వ పాఠ శాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ప్రజలను పునరావాస కేంద్రాల్లో అందుతున్న ఆహారం, వైద్యం, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడా లని అధికారులను ఆదేశించారు. వరద ముంపు బాధితులను ఆదుకునేం దుకు ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరిస్తుందన్నారు.

స్వల్పంగా పెరిగి.. ఆపై తగ్గిన మున్నేరు

మహబూబాబాద్‌లో 17.9 సెంమీ వర్షపాతం నమోదవగా.. శనివారం సాయంత్రం ఆరుగంటల వరకు 8.25 అడుగులు ఉన్న మున్నేరు, ఆ తర్వాత స్వల్పంగా పెరుగుతూ ఆదివారం ఉదయం 7 గంటలకు 15.75 అడుగులకు చేరింది. ఆ తర్వాత వర్షం తగ్గడంతో మున్నేరు వరద ఉధృతి కూడా తగ్గుముఖం పడుతూ వచ్చింది. అప్పటి నుంచి తగ్గుముఖం పడుతూ ఆదివారం సాయంత్రం ఆరుగంటలకు 13.10 అడుగులకు చేరింది. శనివారం కురిసిన వర్షాలతో వాగులు పొంగిపొర్లడంతో జిల్లాలో పలు ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

రాజకీయాలకు అతీతంగా బాధితులను ఆదుకోవాలి

- సాయం అందించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది
- రాష్ట్రం నుంచి నివేదిక రాగానే కేంద్ర అధికారుల పర్యటన
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- మున్నేరు, ఆకేరు వరద బాధితులకు పరామర్శ
- మంత్రి పొంగులేటి, ఎంపీలు ఈటల, విశ్వేశ్వరరెడ్డితో కలిసి విస్తృత పర్యటన
- నేడు మొదటి విడత సాయం: మంత్రి పొంగులేటి

ఖమ్మం బైపాస్‌రోడ్డు/తిరుమలాయపాలెం, సెప్టెంబరు 8: రాజకీయాలకు అతీతంగా వరద బాధితులను ఆదుకోవాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని, వారిని తక్షణమే స్టేట్ డిజాస్టర్ ఫండ్స్ నిధులను వాడుకుని ఆదుకోవా లన్నారు. సాయం చేసేందుకు కేంద్రం కూడా సిద్ధంగా ఉందన్నారు. వరద ముంపు బాధితులను పరామర్శించేందుకు ఆయన ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించారు. నగర శివారులోని ధంసలాపురం కాలనీలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డిలతో కలిసి వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనం తరం సమీప ప్రాంతంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ప్రజలకు నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వరద విపత్తుపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాతో సీఎం రేవం త్‌రెడ్డి మాట్లాడారని ప్రజలెవ్వరు ఆందోళన చెందవద్దన్నారు. స్టేట్ డిజాస్టర్ ఫండ్స్(ఎస్‌డీఎఫ్) నిధులను వాడుకుని ప్రజల కు అండగా ఉండాలని, అవసర మైతే ఇంకా నిధులను మంజూరుచేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక రాగానే కేంద్రం నుంచి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తామ న్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ అధికారులు జిల్లాలో పర్యటిస్తారన్నారు. సహా యక చర్యల్లో ప్రభుత్వాలే కాకుండా స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని, తాము ప్రజలకోసమే పనిచేస్తామన్నారు. ప్రధాని హోదాలో మోదీ రాష్ట్రానికి వస్తే స్వాగతం పలికేందుకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను 'బడేబాయ్' అని పిలిస్తే దాన్ని కూడా కొందరు రాజకీయం చేశారన్నారు. ఇలాంటి విపత్తు సమయంలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజకీయ లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. గత ప్రభుత్వంలో ఆనాడు కేంద్ర ప్రభుత్వ సుమారు రూ.1,348కోట్లు విపత్తు నిధులు మంజూరు చేస్తే వాటిని వాడుకోకపోవడం దురదృష్టకరమన్నారు. మున్నేరు వరద బాధితులెవ్వరూ ఆందోళన చెందవద్దని, సోమవారం ఉదయం బ్యాంక్ సమయానికి మొదటి విడత సాయం కింద కొంత నగదు బాధితుల అకౌంట్లలో జమచేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల చైర్మన్ మువ్వా విజయ్‌బాబు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్‌మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, దేవకీ వాసు దేవరావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, అల్లిక అంజయ్య, రవికుమార్, రుద్ర ప్రదీప్, శ్యామ్ రాథోడ్, భద్రం, చావాకిరణ్, మందా సరస్వతి, విజయరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న మహిళలు

ముంపు ప్రాంతంమైన ధంసలాపురం కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకు నేందుకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కారును స్థానిక మహిళలు కొందరు అడ్డగించారు. దీంతో మంత్రి కారు దిగి వారితో మాట్లాడారు. వర్షాలకు చాలా నష్టపోయామని తమను పట్టించుకునేవారు లేరని మంత్రికి తెలిపారు. దీంతో పక్కనే ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధితులకు సాయం అందిస్తా మని హామీ ఇచ్చారు. ఈ ఘటన కంటే ముందు కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న మంత్రుల కాళ్లపై ఓ మహిళ పడి తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాలి

భారీవర్షంతో మండలంలోని రాకాసితండాలో సర్వం కోల్పోయిన బాధితులకు కేంద్రం అండగా ఉండి ఆదుకుంటుందని విపత్తులు వచ్చినప్పుడు రాజకీయా లకు అతీతంగా ప్రజలను ఆదుకోవాలని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి.కిష న్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరు వరద బాధితు లను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరామర్శించారు. ప్రజలందరి ఆమోదంతో రాకాసితండాను సురక్షిత ప్రాంతానికి మార్చే ఏర్పాటు చేయాల న్నారు. వరద బాధితులు ధైర్యంగా ఉండాలని, వారిని ఆదుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వే శ్వరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధరరెడ్డి, సీపీ సునీల్‌దత్, జేసీ మధుసూదన్‌నాయక్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీను, బీజేపీ నాయకులు టి.నరేందర్‌రావు, బొడ్డుపల్లి ప్రసాద్, గుండా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ మంగీలాల్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న దృశ్యం



హైసా పంపిణీ కిట్లను పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు, నిర్వాహకులు

'హైసా' నుంచి మున్నేరు వరద బాధితులకు సహాయం

- రూ.3 కోట్లతో 10వేల నిత్యవసరాల కిట్లు
- హైదరాబాద్‌లో కిట్ల పంపిణీ వాహనాలను ప్రారంభించిన మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు

4

వదలని వాన

- ఇరు జిల్లాల్లో భారీ వర్షం
- పలుచోట్ల రోడ్లపై ప్రవహించిన వాననీరు
- చింతకాని మండలంలో చేపలవేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

ఖమ్మం/కొత్తగూడెం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు నమోదు కావడంతో జిల్లా వ్యాప్తంగా ముసురు కొనసాగింది. భద్రాద్రి జిల్లాలో గత రెండు రోజులు గా భారీ వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్నపురెడ్డిపల్లిలో ఆదివారం అత్యధికంగా 9.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు సూచించారు. భారీ వర్షాలతో జిలాలోని జిల్లాలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్ప డింది. గోధుమవాగు, ముర్రేడువాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని పూర్తిస్థాయి నీటిమట్టం 406 అడుగులకు చేరడంతో నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చంద్రుగొండ, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు టేకులపల్లి, ఆళ్లపల్లి, గూండాల, ములకలపల్లి, అశ్వాపురం, మణుగూరు తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది.



భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలంలో తుమ్మలవాగు పొంగడంతో చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఖమ్మం జిల్లాలో 5.6సెంటీమీటర్ల వర్షపాతం

ఖమ్మం జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 5.6 సెంమీ సగటు వర్షపాతం నమోదైంది. తల్లాడ మండలంలో అత్యధికంగా 12.6 సెంటీమీటర్ల వర్షం కురింది. ఖమ్మం అర్బన్‌లో 11.5, రఘునాథపాలెంలో 9.2 సెంమీ, వైరా, కొణిజర్లలో 9 సెంమీ, వేంసూరులో 8.7 వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లో భారీగానే వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలకు రఘునాథపాలెం మండలం చిమ్మపూడి-కోయచెలక రోడ్డు తెగిపోవడంతో ఖమ్మానికి రాకపోకలు నిలిచిపోయాయి. లింగాల నుంచి డోర్నకల్ వెళ్లే రహదారిపై బుగ్గవాడు ఉధృతంగా ప్రవహించడంతో దాన్ని మూసేశారు. కొణిజర్ల మండలం పగిడేరు వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతకాని మండలం జగన్నాథపురానికి చెందిన పిల్లి వీరస్వామి (58) తుమ్మలమ్మ చెరువుకు చేపలవేటకు వెళ్లి గల్లంతయ్యాడు.

కొలువుదీరిన గణనాథుడు

- భక్తి శ్రద్ధలతో వినాయకచవితి వేడుకలు ప్రారంభం
- పూజలకు ఆటంకం కలిగిస్తున్న వర్షాలు, వరదలు



ఖమ్మం సెప్టెంబరు 8: వినాయకచవితి సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథుడు కొలు వుదీరాడు. ఇళ్లు, వీధులతోపాటు, అపార్టు మెంట్లు, వ్యాపారసంస్థల్లో వినాయక విగ్ర హాలను ప్రతిష్ఠించారు. ఒక అడుగు నుంచి 35 అడుగుల వరకు ఉన్న వినాయక విగ్ర హాలు నగరంలో కొలువుతీరాయి. అయా విగ్రహాల్లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలే అధికంగా ఉన్నాయి. భారీ వర్షాలు వరదల కారణంగా ఈసారి నగరంలో విగ్రహాల సంఖ్య కొంత తగ్గింది. నగరంలో 800 విగ్ర హాలు ఏర్పాటు చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కు మార్ బ్రాహ్మణ బజార్ శివాలయం వద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డౌలే లక్ష్మీప్రసన్న, సాయికిరణ్‌లు ప్రత్యేక పూజలు చేశారు.

ఉత్సవాలకు వర్షం ఆటంకం..

వర్షాలు, వరదలు వినాయక ఉత్సవాలకు ఆటంకంగా మారాయి.. ఇళ్లల్లో పూజలకు ఆటంకం కలగక పోయినా వీధుల్లో నెలకొల్పిన వేదికల వద్ద విఘ్నాలు తప్పలేదు. టెంట్లు కూలి పోవటం, వర్షం నీరు నిలిచి ఉండటంతో పాటు వేదికల ప్రాంతంలోకి వరద చోటు చేసుకోవటంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. విడవకుండా వాన కురవటంతో పూజలకు హాజరయ్యే భక్తుల సంఖ్య తగ్గింది.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మంత్రి తుమ్మల



ఖమ్మం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం హైదరాబాదులో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో పార్టీ మరిన్ని విజయాలు సాధించేలా పీసీసీ అధ్యక్షుడిగా కృషి చేయాలని కోరారు.

మున్నేరు బాధితులకు పరిహారం సిద్ధం

- తొలి విడత సర్వే పూర్తి.. బ్యాంకు అకౌంట్లు ఆన్‌లైన్
- 9,258 నివాసాలు ఆన్‌లైన్ పూర్తి
- 19 డివిజన్లలో 14 బృందాలు సర్వే
- మరో 180 నివాసాల బ్యాంకు అకౌంట్ల సేకరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 8: మున్నేరు వరదలతో పాటుగా ఖమ్మం నగరంలో భారీ వర్షాల బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం ఏ క్షణంలోనైనా వారి బ్యాంకు ఖాతాల్లో కానుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటు రెవెన్యూశాఖతో పాటుగా ఆటు ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం ఉద్యోగులు గత మూడు రోజులు సమన్వయంతో పనిచేశారు. నగ రంలోని 19డివిజన్లలో 14బృందాలుగా ఏర్పాడి ఇంటింటి సర్వే చేప ట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఐదు విభాగాల్లో సర్వేను పూర్తి చేశారు. తొలి విడతలో 9,258 నివాసాల సర్వే పూర్తి చేసి బాధి తుల వివరాలను ఆన్‌లైన్ చేశారు. మరో 180 నివాసాలకు సంబం ధించిన బాధితుల బ్యాంకు ఖాతాల వివరాలు అందకపోవటంతో వారి వివరాలను అధికారులు సేకరించే ప్రయత్నంలో ఉన్నారు.

19 డివిజన్లలో 9,258 మంది గుర్తింపు ఇలా..

ఖమ్మం నగరంలో 60డివిజన్లుండగా వాటిలో 19డివిజన్లలో తీవ్రంగా వరద ముంపు ఏర్పడింది. దీంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమి షనర్ అభిషేక్ ఆధ్వర్యంలో 14 రెవెన్యూ బృందాలు తొలి విడత సర్వే పూర్తి చేశారు. దీంతో ఏ క్షణమైనా బాధితుల బ్యాంకు ఖాతాలకు పరి హారం జమ జరిగి, లబ్ధిదారుల సెల్‌పోన్‌లకు పరిహారం డబ్బుల వివ రాలు మెస్సెజ్‌లు రానున్నాయి.

వరద నష్టం రూ.339.46కోట్లు

- అధికంగా వ్యవసాయ శాఖకు రూ.111కోట్ల 87లక్షల 96 వేల నష్టం

4

దోనాలకుంట ఎన్‌కౌంటర్‌కు నిరసనగా..

- నేడు మావోయిస్టుల బంద్
- అప్రమత్తమైన పోలీసులు
- భద్రాద్రి జిల్లావ్యాప్తంగా తనిఖీలు
- అడవుల్లో కూంబింగ్ ముమ్మరం చేసిన బలగాలు

చర్ల, సెప్టెంబరు 8: భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం దోనాలకుంట వద్ద మూడు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా సోమవారం మావోయిస్టులు రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. అందులో భాగంగా మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామ రాజు జిల్లా కమిటీ కార్యదర్శి ఆజాద్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బంద్‌కు పిలుపు నిచ్చారు. బంద్ నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. అన్ని మండలాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా చర్ల మండలంలో సీఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. బంద్ నేపథ్యంలో కరకగూడెం, మణుగూరు, పినపాక, దుమ్ముగూడెం చర్ల, అటు ములుగు జిల్లా ల్లోని వెంకటాపురం, వాజేడు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లోకి గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలు చొచ్చుకుపోతున్నాయి. మావోయిస్టుల కోసం అణువ నువూ గాలిస్తున్నాయి. అలాగే ప్రధాన రహదారులపై సివిల్ పోలీసులు తని ఖీలు నిర్వహిసున్నారు. రోడ్లపై కల్వర్టుల వద్ద భద్రత పెంచారు. డాగ్‌స్కాడ్, బాంబ్ స్కాడ్‌లతో తనిఖీలు చేస్తున్నారు. బంద్ నేపథ్యంలో మావోయిస్టులు విధ్వంసకర ఘటనలకు పాల్పడ వచ్చనే అనుమానంతో అధికారులు ఇసుక క్వారీలను మూసి వేశారు. రాత్రి వేళల్లో ఆర్‌టీసీ బస్సులు నడపొద్దని ఆదేశిం చారు. మావోయిస్టుల హిట్ లిస్టులో ఉన్న వారిని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

వరదల్లో 69 ప్రభుత్వ బడులు


జడ్పీహెచ్ఎస్ జలగంనగర్ పాఠశాల


కేజీబీవీ కొత్తురు కళాశాల


జమలాపురం పాఠశాల

- వరదల్లో 69 ప్రభుత్వ పాఠశాలలు
- దెబ్బతిన్న కంప్యూటర్లు, రికార్డులు, కూలిన గోడలు
- మరో వారం వరకు చదువులకు ఇబ్బందులే

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 8: భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా జిల్లాలోని 69 ప్రభుత్వ పాఠశాలలు వరద నీటితో చెరువుల్లా మారాయి. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన బియ్యం బియ్యం, సరుకులు తడిసి వరదల్లో కొట్టుకోని పోయాయి. వరదలకు దెబ్బతిన్న పాఠశాలలను శుభ్రం చేయాలంటే మరో వారం రోజులు వరకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. బోనకల్ మండలంలో 2 పాఠశాలలు, ఏన్కూర్‌లో 9, కామేపల్లిలో 2, 8, ఖమ్మం అర్బన్‌లో 12, కొణిజర్లలో 3, కూసిమంచిలో 3, మధిరలో 4, నేలకొండపల్లిలో 6, పెనుబల్లిలో 3, రఘునాథపాలెంలో 4, సింగరేణిలో 5, సత్తుపల్లిలో 1, తిరుమలాయపాలెంలో 4, వేంసూర్‌లో 2, ఎర్రుపాలెంలో 2 పాఠశాలలు, మొత్తం 69 పాఠశాలలు వరద ముంపునకు గురయ్యాయి. ఖమ్మం రూరల్ మండలంలోని జలగంనగర్‌లో ఉన్నత, ప్రైమరీ, తనగంపాడు, కెఆర్‌జీ తండ పాఠశాలలో వరదకు మధ్యాహ్న బోజన బియ్యం పూర్తిగా తడిశాయి. మధిరలో రొంపిమళ్ల, అత్తుకురులో రెండు పాఠశాలలు, పెనుబల్లిలో కుప్పెనకుండ్ల, వేంసూర్‌లో కందుకూరు పాఠశాలల్లో బియ్యం పూర్తిగా తడిశాయి.

ఎర్రుపాలెం మండలం జమలాపురం పాఠశాల ప్రహరిగోడ వరదలకు దెబ్బతిని కొంతమేర పడిపోయింది. ఖమ్మం నగరంలోని నయాబజార్ పాఠశాల, కళాశాల ప్రహరిగోడ కొంత మేర పూర్తిగా పడిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మరో మారు ఉచిత పుస్తకాలను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

వైరా, సెప్టెంబరు 8: నియోజకవర్గ, మండల, మునిసిపల్ కేంద్రమైన వైరా నడిబొడ్డులోని 1,2వార్డుల ప్రజలకు శ్మశాన వాటికకు వెళ్లే దారి తిప్పలు తప్పటం లేదు. రెండోవార్డులోని హనుమాన్‌బజార్‌లో ఆదివారం మృతి చెందిన పల్లపు శ్రీను శవాన్ని నడుములోతు గోతుల్లో నుంచి శ్మశాన వాటికకు తీసుకువెళ్లి అంతిమ సంస్కారాలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దాదాపు దశాబ్ద కాలం నుంచి ఈ శ్మశాన వాటికకు వెళ్లే దారిపై తీవ్ర వివాదం నెలకొంది. దాదాపు వందేళ్ల కిందట వైరా రిజర్వాయర్ నిర్మాణ సమయంలో ఏపీలోని పల్నాడు ప్రాంతానికి వడ్డెర సామాజిక వర్గం వారు వందలాది మంది వైరా వచ్చి రిజర్వాయర్ నిర్మాణ పనుల్లో పాలు పంచుకున్నారు. అప్పటి నుంచి వైరా రిజర్వాయర్ శిఖం భూమినే వడ్డెర సామాజిక వర్గం వారు శ్మశాన వాటికగా వినియోగించుకుంటున్నారు. వడ్డెర సామాజిక వర్గం వారు ఏకంగా వైరాలో హనుమాన్‌బజార్ పేరుతో నివాసాలు ఏర్పాటుచేసుకున్నారు. వడ్డెర సామాజిక వర్గంతో పాటు మునిసిపాలిటీ ఒకట్రెండు వార్డుల్లో ఓసీ, బీసీ, ఎస్సీ ఇతర సామాజిక వర్గాల వారు కూడా వచ్చిచేరారు. ఈ రెండు వార్డుల్లోని మూడువేల మంది ప్రజలు చెరువు శిఖంలోని శ్మశాన వాటికనే ఉపయోగించుకుంటున్నారు. అయితే హనుమాన్‌బజార్ నుంచి శ్మశాన వాటికకు వెళ్లేందుకు గతంలో దారి సౌకర్యం ఉండేది. అయితే కొంతమంది ఇతర వ్యాపారాల పేరుతో పదుల సంఖ్యలో శిఖం భూములు ఆక్రమించి కొన్ని ఎకరాలను కొనుగోలు చేసి పట్టాలు చేయించుకొని దారి సౌకర్యాన్ని బంద్ చేయడంతో ఈ దారి సమస్య తలెత్తింది. దశాబ్దకాలం నుంచి అనేక సందర్భాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీస్, రెవెన్యూ అధికారులు ఈ సమస్యను తాత్కాలికంగా సర్దుబాటు చేయడం తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు. రిజర్వాయర్ శిఖం భూమి, దారి ఉన్న స్థలం కొణిజర్ల మండలం గుండ్రాతిమడుగు రెవెన్యూ పరిధిలో ఉంది. వర్షం కురిసిన సమయాల్లో ఎవరైనా మృతిచెందితే శవాలను నడుములోతు బురదలో శ్మశాన వాటికకు చేర్చాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఆదివారం పల్లపు శ్రీను మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లే సమయంలో కూడా దారి విషయంలో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనేక ఇబ్బందులకోర్చి బురదలో నుంచే శవాన్ని తీసుకువెళ్లి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇప్పటికైనా ఆక్రమించి తప్పుడుమార్గంలో పట్టాలు చేయించుకున్న వారి నుంచి తమకు దారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వైరా నడిబొడ్డులో శ్మశాన వాటికకు

దారి తిప్పలు

- దశాబ్ద కాలంగా కొనసాగుతున్న వివాదం


బురదలో శవాన్ని మోసుకువెళ్తున్న దృశ్యం

ప్రమాదపుటంచున

'సింగభూపాలెం'


నిండుకుండను తలపిస్తున్న సింగభూపాలెం చెరువు

- భారీ వర్షాలకు అలుగు పోస్తున్న చెరువు
- కుంగిన చోటే మళ్లీ కుంగుతున్న వైనం
- కట్ట తెగితే రెండు మండలాలకు ముప్పు

సుజాతనగర్, సెప్టెంబరు 8 : సుజాతనగర్ మండలానికి కల్పతరువులాంటి సింగభూపాలెం చెరువు ఇప్పుడు ప్రమాదపుటంచున కునారిల్లుతోంది. మండలంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అలుగుపోస్తోంది. అర టీఎంసీ నీటి నిల్వ కలిగిన ఈ చెరువు సుమారు 2500 ఎకరాల ఆయకట్టు సాగుతో విరాజిల్లుతోంది. అంతే కాకుండా సుమారు 500 మత్స్య కుటుంబాలు ఈ చెరువు మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. జిల్లాలోనే అతి పెద్ద చెరువులో ఒకటైన ఈ సింగభూపాలెం చెరువు ఇప్పుడు చెరువు కట్ట కుంగడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. 1935లో ఏర్పాటైన ఈ చెరువు ఈ ప్రాంత రైతులకు కల్పతరువుగా ఉంది. 1985లో వచ్చిన అతి భారీ వర్షాలకు చెరువు కట్ట తెగడంతో అలుగు ఎత్తు తక్కువగా ఉండటంతో పెను ప్రమాదం నుంచిబయటపడ్డారు. 2016లో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం సుమారు 20 కోట్ల వ్యయంతో కరకట్ట మరమ్మత్తులు, అలుగు ఎత్తి పెంచారు. 16 అడుగులుగా ఉన్న అలుగు ఎత్తున 20 అడుగులకు పెంచి కరకట్టను పటిష్టం చేశారు. అనంతరం మరమ్మతులు పూర్తయిన సంవత్సరమే కరకట్ట కుంగడంతో మరమ్మత్తులు చేపట్టి, అలుగు ఎత్తును కూడా తగ్గించారు. మరల మరమ్మతులు పూర్తయి రెండు సంవత్సరాలు కావస్తున్నాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సింగభూపాలెం చెరువు కరకట్ట గతంలో కుంగిన చోటే మరల పగుళ్లు ఏర్పడి కుంగుబాటుకు గురవుతుందని మండల రైతులు ఆందోళనలో ఉన్నారు. కుంగిన చోట అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. పగుళ్లలో ఇసుక వేసి నింపుతున్నారు. కరకట్ట తెగితే సుజాతనగర్ మండలంలో కొన్ని గ్రామాలతో పాటు చుంచుపల్లి మండలంలో మరి కొన్ని గ్రామాలు నీట మునిగే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు పటిష్టతపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కుంగిన ప్రదేశాన్ని పరిశీలించిన సీపీఎం మండల కమిటీ బృందం

కరకట్ట చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మించాలి సీపీఎం మండల కమిటీ

సింగభూపాలెం చెరువు మొదటి నుంచీ కుంగుతోందని, నాసిరకంగా నిర్మించారని గతంలో ఎన్నో పర్యాలు ఆందోళన చేపట్టామని, రెండు పర్యాయాలు కరకట్ట కుంగిందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా అధికారులు కరకట్ట చుట్టూ శాశ్వత ప్రాతిపదికన రిటైనింగ్ వాల్ నిర్మించాలని నేడు కుంగిన ప్రదేశాన్ని పరిశీలించిన సీపీఎం మండల కమిటీ బృందం కోరుతోంది.

అలుగుపడిన

వైరా రిజర్వాయర్

- ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు

వైరా, సెప్టెంబరు 8: వైరాలో శనివారం మధ్యాహ్నం నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. 90.81మి.మీ. వర్షపాతం నమోదైంది. వైరా రిజర్వాయర్ నీటిమట్టం ఆదివారం ఉదయానికి 20.3అడుగులకు పెరిగి సాయంత్రానికి 19.9అడుగులకు తగ్గిపోయింది. రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియా అయిన ఏన్కూరు, తల్లాడ, కొణిజర్ల, కామేపల్లి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గంటల వ్యవధిలోనే దాదాపు ఒకటిన్నర అడుగుల నీటిమట్టం పెరిగింది. దాంతో రిజర్వాయర్ ఐదు అలుగుల నుంచి వరదనీరు నదిలో పరవళ్లు తొక్కింది. ఫలితంగా స్నానాల లక్ష్మీపురం-సిరిపురం గ్రామాల మధ్య వైరా నదిలోని కాజ్‌వేపైనుంచి వరద నీరు పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిల్చిపోయాయి. నల్లచెరువు అలుగు పొంగి ప్రవహించడంతో తాటిపూడి-మునలిమడుగు మధ్య కల్వర్టుపైనుంచి వరద నీరు ప్రవహించింది. తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎస్ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్, నీటిపారుదలశాఖ డీఈఈ పి.శ్రీనివాస్ తదితర అధికారులు వైరా రిజర్వాయర్ నీటిమట్టాన్ని అలాగే వైరా నదిలో వరద ఉధృతిని, స్నానాల లక్ష్మీపురం వద్ద వరదను పరిశీలించారు. వైరాలోని ముంపు ప్రభావిత ప్రాంతలైనా ఇందిరమ్మకాలనీ, రాజీవ్ కాలనీల్లోని వారిని శనివారం అర్ధరాత్రి మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, తహసీల్దార్ శ్రీనివాసరావు, పోలీసులు పునరావాస కేంద్రాలకు తరలించారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఆదివారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు నిత్యావసర సరుకులను అందజేశారు. వైరా మునిసిపాలిటీ 13వ వార్డు మండలపరిషత్ కార్యాలయ సమీపంలో రేకులషెడ్ కూలి ఒక యువతికి గాయాలయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అధికార యంత్రాంగం అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులు శనివారం రాత్రి నుంచి అప్రమత్తమై పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో సహాయ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. గంగదేవిపాడు, రాళ్ల వాగులు, ఇతర వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.


ముంపు బాధితులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న కమిషనర్ వేణు

వరద బాధితులకు 'హైసా' సాయం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 8: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కృషి మేరకు ఖమ్మంలోని వరద, భారీ వర్షం బాధితులకు భారీ ఊరట లభించింది. హైదరాబాద్‌లోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హైసా(హెచ్‌వైఎస్ఈఏ) ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చింది. రూ.3కోట్ల వ్యయంతో 10వేల నిత్యవసరాల, వస్తువులు కిట్లును ఏర్పాటు చేశారు. ఒక్కో కిట్‌లో రూ.3వేల విలువ కలిగిన నిత్యవసరాలు, ఇతర వస్తువులను ఏర్పాటు చేశారు. కాగా ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు కిట్ల కార్యక్రమం ప్రారంభించారు. దీంతో వాహనాలు హైదరాబాద్ నుంచి ఖమ్మానికి బయలుదేరాయి.

వరదలతో మద్యం దుకాణలు బంద్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 8: ఖమ్మం నగరంలో వరదలు కారణంతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ఖమ్మం నగరంలోని మద్యం దుకాణాలపై తాత్కాలిక ఆంక్షలను పెట్టారు. శనివారం రాత్రి 9గంటలకే మద్యం దుకాణాలను బంద్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంతో పాటుగా 5కి.మీ. దూరంలో మద్యం దుకాణాలను బంద్ చేయాలని ఆదేశించారు. దీంతో నగరంలోని బెల్ట్ దుకాణాలకు గిరాకి పెరిగింది.

కొట్టుకుపోయిన కోయచెలక రహదారి

రఘునాథపాలెం, సెప్టెంబరు 8: వరదలతో వారం వ్యవధిలోనే కోయచెలక ప్రధాన రహదారి కేవలం వారం రోజుల్లోనే రెండు సార్లు కొట్టుకుపోయింది. మండలంలో కోయచెలక నుంచి కోటపాడు ప్రధాన రహదారి నుంచి పది గ్రామాలకు రవాణా సౌకర్యం ఉంది. గత వారం కోయచెలక వద్ద రహదారికి గండి పడింది. తర్వాత అధికారులు గండిని పూడ్చివేశారు. తిరిగి ఆదివారం వర్షం రావటంతో అధికారులు పూడ్చిన గండి వరదకు కొట్టుకుపోయింది.

రెండోసారి ముంపునకు గురైన కాలనీలు

- ఆక్రమణలు తొలగించాలని బాధితుల ఆందోళన
- పరిశీలించిన మేయర్, కమిషనర్..
- తక్షణ చర్యలకు ఆదేశం..


మేయర్, కమిషనర్ సమస్యను వివరిస్తున్న సరిపూడి, చావా

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 8: ఐదురోజుల క్రితం ఖమ్మం నగరంలో కురిసిన వర్షాలతో పదుల కొద్దీ కాలనీలు నీట మునిగాయి. అయితే ఆ రోజు ఖమ్మం అర్బన్ పరిధిలో 15.34 సెంమీ వర్షపాతం నమోదైంది. దాంతో భారీగా వరద వచ్చి చేరిందని, అందువల్లనే కాలనీల్లో అంత భారీస్థాయిలో నీరు వచ్చి చేరిందనికొందరు అధికారులు చెప్పారు. కానీ వారం రోజులు తిరగకముందే కొద్దిపాటి వర్షపాతానికే రెండోసారి మళ్లీ వరద కాలనీలను ముంచింది. శనివారం రాత్రి నగరంలోని చైతన్య నగర్, కవిరాజ్ నగర్‌తోపాటు, మరికొన్ని కాలనీల్లో నడుముల్లోతు నీళ్ల చేరాయి. ఖమ్మం నగరంలోని రాపర్తినగర్ సమీపంలోని బైపాస్‌రోడ్డు మీదకు నీళ్ల పొంగిపొర్లాయి. నగరంలో శనివారం కురిసిన 5.7 సెంమీ వర్షానికే ఆయా కాలనీలు మునగడం చర్చనీయాంశంగా మారింది. ఆయా కాలనీ వాసులకు అర్ధరాత్రి నుంచి కంటిమీద కునుకులేకుండా గడిపారు. ఆయా ప్రాంతాల కార్పొరేటర్లు చావా నారాయణరావు, సరిపూడి సతీష్ అప్రమత్తమై వరదనీరు వెళ్లేందుకు ప్రొక్లెయిన్లతో లకారం చెరువు వద్ద దారి చేయడంతో కొంతమేరకు ముప్పు తప్పినా కాలనీల్లో మాత్రం ఆదివారం మధ్యాహ్నం వరకు నీళ్ల నిలబడే ఉన్నాయి. దాంతో ఆయా డివిజన్లలో నివాసం ఉండే స్థానికులు కాల్వపై ఉన్న ఆక్రమణలు తొలగించాలంటూ దర్నా నిర్వహించారు. అనంతరం ఆ కాల్వను పరిశీలించిన మేయర్ పునకొల్లు నీరజ, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య వరద నీరు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ పరిష్కారంలో భాగంగా ఓ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే కాలనీలు నిత్యం మునకకు గురవకుండా ఉండాలంటే పూర్తిగా ఆక్రమణలను తొలగించాలని, కాల్వకు రెండు వైపులా ఎత్తుగా రక్షణ గోడలు నిర్మించాలని ఆయా కాలనీల వాసులు కోరుతున్నారు. ఖానాపురం చెర్వు నుంచి లకారం అలుగు, కాల్వలు ఆక్రమణలు జరగటంతో ఇటువంటి వరదల ముంపు ఏర్పడిందని పేర్కొన్నారు. ఇళ్ల మీదకు వరద రావటానికి కారణమైన భవనాలు, ఐస్ ఫ్యాక్టరీలు, అక్రమ కట్టడాలను వివరించారు.


కాల్వ ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

క్షేత్రస్థాయికి వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేయాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మధిర నియోజకవర్గంలో ముంపు ప్రాంతాల పరిశీలన

బోనకల్/ చింతకాని/ ముందిగొండ/ ఎర్రుపాలెం, సెప్టెంబరు 8: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలకు వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. మధిర నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన ఆయన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బోనకల్ మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ముంపును గురైన బీసీ కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ కాల్వ నిర్మించాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరావు, సురబి వెంకన్నలు భట్టిని కోరడంతో అంచనాలు రూపొందించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈని భట్టి ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై భట్టికి వినతిపత్రాలు అందించారు. గోవిందాపురం(ఎ)గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా విద్యుత్ షాక్‌తో రెండేళ్ల క్రితం మృతి చెందారు. అతడి కుటుంబానికి ఆదివారం డిప్యూటీ సీఎం పర్యటనలో బాగంగా ముష్టికుంట్లలో కాంగ్రెస్ నాయకుడు బాగం నాగేశ్వరరావు రూ.5వేల నగదును వితరణగా అందజేశారు.

చింతకాని మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, పంటలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ఆదివారం మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం, నాగులవంచ గ్రామాల్లో ఆయన వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. మత్కేపల్లి గ్రామంలో మున్నేరు వరద దాటికి పాడైన బ్రిడ్జి అప్రొచ్ రోడ్డును పరిశీలించారు.

గచ్చు బంధం వాగు ప్రవాహానికి మత్కేపల్లి- తిరుమలాపురం రోడ్డు కోతకు గురై గండ్లు పడటంతో వ్యక్తిగత సిబ్బంది సహాయంతో వాగు దాటి కొట్టుకుపోయిన చెరువు కట్టను పరిశీలించారు. నాగులవంచ- పాతర్లపాడు రోడ్డుపై బండిరేవును పరిశీలించారు. కార్యక్రమంలో మండల నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కంచం కోటేశ్వరరావు, కంచుమర్తి రామకృష్ణ, బొర్రా ప్రసాద్ పాల్గొన్నారు.

ముదిగొండ మండలం క్రిష్టాపురం, ముదిగొండ, బాణాపురం, కమలాపురం, వల్లభి, అమ్మపేట, చిరుమర్రి గ్రామాల్లో పర్యటించిన భట్టి పంటనష్టాన్ని పూర్తిగా అంచనా వేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

తమకు రూ.రెండులక్షలలోపు రుణమాఫీ కాలేదని కొంతమంది రైతులు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకురాగా సాంకేతిక ఇబ్బందులు, సమాచార లోపంతో ఎవరికైనా రూ.రెండులక్షలలోపు రుణమాఫీ కాని సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఎంతమంది సిబ్బంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వల్లభి చెరువు కట్ట తెగిపోవడంతో కోతకు గురైన రోడ్డును సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ పసుపులేటి దేవేంద్రం, నాయకులు వీరబాబు, మల్లెల అజయ్, ఆది నారాయణరెడ్డి, పుల్లారెడ్డి, బిక్షం, అజ్గర్, అన్వేష్, వినోద్, రాఘవ పాల్గొన్నారు.


ముష్టికుంట్లలో ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం


మత్కేపల్లి చెరువును పరిశీలిస్తున్న భట్టి

వరద నష్టం రూ.339.46కోట్లు

- అధికంగా వ్యవసాయశాఖకు రూ.111.87 కోట్ల నష్టం

ఖమ్మం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాలో మున్నేరు వరదతోపాటు భారీవర్షాల కారణంగా జరిగిన నష్టాలను అధికారులు సర్వే ద్వారా అంచనాలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం రూ.339.46కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు నిర్ధారించారు.

రెవెన్యూశాఖ నుంచి మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా కింద ఆరుగురికి రూ.30లక్షలు చెల్లించారు. జిల్లాలో 15,055 పక్కా ఇళ్ల దెబ్బతినడంతో రూ.9కోట్ల78లక్షల57వేల500, 146 గుడిసెలు పడిపోవడంతో రూ.11లక్షల65వేల నష్టం జరిగింది. ఇల్లు దెబ్బతినడం, కూల డం ద్వారా రూ.9కోట్ల90లక్షల 25వేల 500ల నష్టం జరిగింది.

పశుసంవర్ధక శాఖ పరిధిలో పశువులు, కోళ్ల మృతిచెందడంతో రూ.కోటి16లక్షల35వేల300 నష్టం, ఆర్‌అండ్‌బీ, పీఆర్‌ల రోడ్లు బ్రిడ్జిలు దెబ్బతినడంతో రూ.180కోట్ల37లక్షల65వేల నష్టం జరిగింది. విద్యాశాఖకు పాఠశాల భవనాలు దెబ్బతినడం ద్వారా రూ.కోటి20లక్షలు, వైద్యారోగ్యశాఖ ఆసుపత్రులు దెబ్బతినడం ద్వారా రూ.30లక్షలు, విద్యుత్‌శాఖకు రూ.7కోట్ల78లక్షలు, వ్యవసాయశాఖకు పంటల నష్టం ద్వారా రూ.111కోట్ల87లక్షల96వేలు, మత్స్యశాఖకు రూ.4కోట్ల29లక్షల65వేల వరకు నష్టం జరిగింది.

శాఖల పరంగా వివరాలు పరిశీలిస్తే వరద కారణంగా ఖమ్మంజిల్లాలో కూసుమంచి మండలంలో ఇద్దరు, సింగరేణి మండలంలో ఇద్దరు, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఒక్కొక్కరు మృతిచెందగా వారికి ఒక్కొక్కరికి రూ.5లక్షల వంతున ఎక్స్‌గ్రేషించా చెల్లించారు. జిల్లాలో పశుసంవర్ధకశాఖ పరంగా 52,648 పశువులు, కోళ్ల చనిపోగా రూ.1,16,35,300 ఆస్తినష్టం జరిగింది. ఇందులో 20 ఆవులు మృత్యువాత పడగా సుమారు రూ. 10లక్షల నష్టం జరిగింది. 8 దూడలు మృత్యువాత పడగా రూ.1,60,000లు, 65గేదెలు మృత్యువాత పడగా రూ.32లక్షల50వేలు, 242 గొర్రెలు మృత్యువాత పడగా రూ.12,10,000, వంద మేకలు మృత్యువాత పడగా రూ.5లక్షలు, 52,153 కోళ్లకు రూ.52,15,300, 60పదులకు రూ.3లక్షలు నష్టం జరిగింది. రోడ్లు 75.77కి.మీ.నష్టం జరగ్గా రూ.55కోట్ల55లక్షల నష్టం జరిగింది. రోడ్లు కొట్టుకుపోవడం ద్వారా 8276కి.మీ.దెబ్బతినగా రూ.16కోట్ల 49లక్షల 50వేల నష్టం జరిగింది. సిమెంట్‌రోడ్లు 62కి.మీ. దెబ్బతినగా రూ.10కోట్ల 83లక్షల15వేలు నష్టం జరిగింది. మొత్తం రూ.180కోట్ల 37లక్షల65 వేల వరకునష్టం జరిగింది. 66 పాఠశాలలు దెబ్బతినగా రూ.కోటి20లక్షల నష్టం, ఆసుపత్రులు రెండు దెబ్బతినగా రూ.30లక్షల నష్టం, విద్యుత్ స్తంభాలు 3500, ట్రాన్సుఫారాలు 570 కలిపి రూ.7కోట్ల 73లక్షల నష్టం జరిగంది మొత్తం రూ.9కోట్ల 23లక్షలకు పాఠశాలలు, ఆసుపత్రులు, విద్యుత్‌కు నష్టం జరిగింది.

79,914 ఎకరాల్లో పంటల నష్టం..

జిల్లాలో వ్యవసాయపంటలకు వర్షాల కారణంగా అధిక నష్టం జరిగింది. మొత్తంగా 53,528మంది రైతులకు 79,914 ఎకరాల్లో పంటనష్టం జరగ్గా రూ.111కోట్ల87లక్షల96వేల మేర నష్టం రైతులకు జరిగింది. ఇందులో 18,375మంది పత్తి రైతులకు 31,119 ఎకరాల పంట దెబ్బతినగా రూ.43కోట్ల56లక్షల66వేలు నష్టం జరిగింది. 63మంది మొక్కజొన్న రైతుల 96 ఎకరాలు నష్టపోగా రూ.13,లక్షల44వేలు నష్టం, పెసర 421మంది రైతులకు 1,075 ఎకరాలు కొట్టుకుపోగా రూ.1కోటి 50లక్షల 50 వేలు వరి పంట 30,460 మంది రైతులకు 41,450 ఎకరాలు దెబ్బతినగా రూ.58కోట్ల3లక్షల మేర నష్టం జరిగింది. ఉద్యాన పంటలకు 4,017మంది మిర్చి రైతులకు 5,942ఎకరాల్లోనష్టం జరగ్గా రూ.8కోట్ల31లక్షల88వేల నష్టం జరిగింది. 156మంది కూరగాయలు రైతులకు 132 ఎకరాల్లో రూ.18లక్షల48వేలు, 32 ఎకరాలలోఅరటి 13మంది రైతులకు రూ.4.లక్షల 48వేల, 23మంది బొప్పాయి రైతులకు 68 ఎకరాల్లో రూ.9లక్షల52వేలు మొత్తంగా ఉద్యానపంటల కింద 4,209మంది రైతులు 6,174 ఎకరాల్లో రూ.8కోట్ల64లక్షల36వేల నష్టం జరిగింది. వ్యవసాయశాఖకు 53,528మంది రైతులు 79వేల 914 ఎకరాల్లో రూ.111.87లక్షల 96వేల విలువైన పంటలుకోల్పోయారు. రూ.4కోట్ల29లక్షలమేర మత్స్య సంపదకు, చెరువులకు నష్టం జరిగింది.

వరద నష్టం వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నాం

● కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంటౌన్,సెప్టెంబరు 8: మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో నష్టం వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఆదివారం నగరంలోని కాల్వొడ్డు, జూబ్లీక్లబ్, రజబ్‌అలీ పార్కు, జూబ్లీపుర తదితర మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి, బాధితులతో మాట్లాడారు. ఇటీవల వచ్చిన వరద ఎన్నడూ లేనివిధంగా జూబ్లీక్లబ్ వరకు రావటానికి గల కారణాలను కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. ప్రధాన సమస్యలను పరిష్కరించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే స్థానికులు, చిరువ్యాపారులతో మాట్లాడి వరద ముంపు ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వరద భీభత్సం సృష్టించిందని, పలు కుటుంబాలకు అపారంగా ఆస్తినష్టం జరిగిందన్నారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, జరిగిన నష్టం వివరాల సేకరణ ప్రక్రియ చురుగ్గా సాగుతోందన్నారు. మున్నేరు వరద బాధితుల సమగ్ర సమాచారం ప్రభుత్వానికి సమర్పించామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని ఇబ్బందులు, రహదారులు, విద్యుత్‌లైన్లు, వివిధ మౌలిక సదుపాయాలపై ప్రాథమిక అంచనాలతో తక్షణ మరమ్మతులు పూర్తి చేస్తున్నామన్నారు. మున్నేరు పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు రావాలని కోరుతూ ఇంటింటికీ తిరిగి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. రానున్న నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కలెక్టర్ వెంట శిక్షణ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ ఉన్నారు.


ముంపు బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ముంపు ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

మున్నేరు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఖమ్మం రూరల్ మండలం తనగంపాడు, పెద్దతండా, పోలేపల్లి, కస్నాతండా, తీర్థాల తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల బాధ్యతలను 65మంది పంచాయతీ కార్యదర్శులకు అప్పగించామన్నారు. 195మంది పారిశుధ్య కార్మికులతో పాటు అదనంగా 327మంది ప్రయివేట్ కార్మికులను పనులకు ఏర్పాటు చేశామన్నారు. 62 ట్రాక్టర్లు, 36 ట్రాక్టర్ ట్యాంకర్లు, 31 ఎక్స్‌కవేటర్లు, 31 డోజర్లు పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులకు వినియోగిస్తున్నట్లు తెలిపారు.

నష్టం ఆధారంగా పరిహారం ఇవ్వాలి

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మం రూరల్, సెప్టెంబరు8: నష్టం ఆధారంగా పరిహారం ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని కస్నాతండా గ్రామంలో వరదముంపునకు గురైన బాధితులను ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో బాధితులకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకారానికి రూ.10 వేలు ఏమూలకు సరిపోదని పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ఆనవాలు కూడా కనిపించకుండా పోయాయన్నారు. ఎప్పుడు చూడని రీతిలో రీతిలో విపత్తు సంభవించిందని విపత్తుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా తగు రీతిలో స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,438 కోట్ల నష్టం జరిగిందని ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసిందన్నారు. నష్టపోయిన ప్రాంతాలకు తక్షణ సాయం ప్రకటించాలని కోరారు. తెలంగాణ విషయంలో వివక్ష ప్రదర్శిస్తున్న కేంద్రం విపత్తు సమయంలోనైనా ఆదుకునేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, మహ్మద్ మౌలానా, తదితరులున్నారు.


బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

'ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ఔన్నత్యం పెంపుదలకే సమ్మేళనం'

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు8: ఎస్ఆర్ బీజీఎన్ఆర్ కళాశాల ఔన్నత్యం పెంపుదలకే అపూర్వ సమ్మేళనం నిర్వహించినట్లు సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు ఉద్ఘాటించారు. ఆదివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.

తొలుత సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో కళాశాల భూరి విరాళం దాత గెంటేల నారాయణరావు 65వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు మాట్లాడుతూ కళాశాల ఔన్నత్యాన్ని పెంపొందించడానికి పూర్వ విద్యార్థి సంఘం గత ఏడాదిగా కృషి చేసిందన్నారు. మానవీయ విలువలు పెంపొందించడమే ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీ ఇగ్నోప్రొఫెసర్ యం. యస్. సీనం రాజు మాట్లాడుతూ యస్ఆర్‌బీజీయన్ఆర్ కళాశాల గొప్ప చరిత్ర, సంస్కృతిని సృష్టించిందని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి వీరెల్లి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ 13రకాల పీజీ కోర్సులు కళాశాలలలో ఉన్నా, అధ్యాపకులున్నా ఒక్క తరగతిగది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాది కదారు ప్రభాకరరావు మాట్లాడుతూ కళాశాల ప్రగతిశీల వారసత్వాన్ని అందించిందని కొనియాడారు. భరత్ విద్యాసంస్థలు అధిపతి శీలం వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆనాడు కళాశాల అందించిన మానవీయ విలువలు కొనియాడారు. అనంతరం సభలో అఖండ జ్ఞాన జ్యోతి గెంటేల నారాయణరావు, చదువులమ్మ ఒడిలో జ్ఞాపకాలం పుస్తకాలను ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థి నాయకుడు, యాంకర్ పూజారి గణాశంకర్ రూపొందించిన డాక్యుమెంటరీని ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థులు మల్లం రమేష్ మాట్లాడే బొమ్మ విన్యాసాలు ప్రదర్శించారు. యం.పుల్లయ్య, కాల్వ కట్ట జాన్, గోవిం ద్, రచయిత దీకొండ చంద్రకళ, రిటైర్డ్ న్యాయమూర్తి మాదార్, బిచ్చల తిరుమలరావు, తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

246 కిలోల గంజాయి పట్టివేత

» రెండు వాహనాలు సీజ్, ఇద్దరి అరెస్ట్ » వివరాలను వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

జూలూరుపాడు, సెప్టెంబరు8: అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని వాహన తనిఖీలలో టాస్క్‌ఫోర్స్ జూలూరుపాడు పోలీసులు కలసి పట్టుకున్నారని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఆదివారం జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలోని తాళ్ల గొమ్మూరు (సారపాక)కు చెందిన దుగ్గింపుడి శివ శంకర్‌రెడ్డి, బూర్గంపాడు మండలం సారపాక గ్రామం మసీదు బజారుకు చెందిన కాలిపి నాగేంద్రబాబు ఇద్దరు వ్యక్తులు కలసి సీలేరులో గంజాయిని కొనుగోలు చేశారని తెలిపారు. ప్యాకెట్లను బయటికి కన్పించకుండా వాటిపై నలుపు రంగు మాగ్నెట్ మ్యాట్‌లను కప్పి ఏపీ28సీకే4500 అనే నెంబరు గల వాహనంలో సారపాకకు వచ్చారు. గంజాయి లోడ్ చేసిన వాహనాన్ని ఇద్దరు వ్యక్తులు కొన్ని రోజులు అక్కడే ఉంచారు. ఈ రోజు ఉదయం గంజాయిని తీసుకొని సారపాక నుంచి బయలు దేరి ఖమ్మం వైపు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలలో జూలూరుపాడు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఆదివారం పట్టుకున్నట్లు తెలిపారు. రూ.87 లక్షల విలువ చేసే 246 కిలోల గంజాయిని పట్టుకున్నారన్నారు. వాహనం తో పాటు, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. కాగా శివశంకర్‌రెడ్డిపై గతంలో గంజాయి తరలిస్తూ పట్టుబడడంతో ఆరు కేసులు ఉన్నాయని, ఆయన ప్రవర్తన మార్చుకోకుండా గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడడంతో అతనిపై 7వ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భారీ స్థాయిలో గంజాయిని పట్టుకున్న జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్, టాస్క్ ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్ఐ ప్రవీణ్‌లకు ఎస్పీ రివార్డులను ప్రకటించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రాణాప్రతాప్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రవీణ్, హెడ్ కానిస్టేబుల్‌లు దయానంద్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

రూ.లక్షా57వేల సాయం అందజేత


నగదును నాగరాజు తల్లిదండ్రులకు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

ఏన్కూరు, సెప్టెంబరు8: తమ తోటి పదో తరగతి వరకు చదువుకున్న ఆపదలో ఉన్న మిత్రుడికి రూ.లక్షా57 వేల నగదు అందించి ఏన్కూరు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు సాయం చేసి ఔదార్యాన్ని చాటారు. ఏన్కూరుకు చెందిన పూర్వ విద్యార్థి మేనుగు నాగరాజు ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాడు. ఇటీవల ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థి అదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గుడిమల్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి ఆనగదును ఆదివారం ఆసుపత్రి వద్ద తల్లిదండ్రులకు అందించారు. నాగరాజును పరామర్శించారు. ఈకార్యక్రమంలో గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థులు గుడిమళ్ల సందీప్, ఉప్పలస్వామి పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు8: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో కళాశాల విద్యా కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో అతిధి అధ్యాపకుల నియామకాలు జరపడానికి అరు లైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్-1, హిస్టరీ-3, ఎకనామిక్స్-1, పొలిటికల్ సైన్స్-2, కామర్స్-2, బీ.బీ.ఏ-2, బీ.సీ.ఏ-1, గణితం-3, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్-3, డేటా సైన్స్-1, బయోటెక్నాలజీ-1, బాటనీ-1, ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను మంగళవారం సాయంత్రం వరకు అన్ని సర్టిఫికెట్ల జీరాక్సులను జతచేసి కళాశాల కార్యాలయంలో అందజేయాలని కోరారు. జనరల్, బీసీ అభ్యర్థులు సంబంధిత పీజీలో, 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో పాటు, నెట్, స్లెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలు ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్వ్యూ, డెమోలను సెప్టెంబరు 11 బుధవారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరు కావాలని తెలిపారు.

పినపాక ఎంపీవోకు బెదిరింపులు!

» అభివృద్ధి పనులను అడ్డుకున్న వ్యక్తులపై కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు

పినపాక, సెప్టెంబరు8: మండల ఎంపీవో కె. వెంకటేశ్వరరావుపై బెదిరింపులకు పాల్పడినట్లు మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. శుక్రవారం జానంపేట గ్రామంలో పారిశుధ్య పనుల నిర్వహణలో భాగంగా ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో కలిసి ప్రధానరోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పూడిక తీయించి, రోడ్డును ఆక్రమించిన కట్టడాలను తొలగించే క్రమంలో సదరు ఎంపీవోపై అక్కడి ఓ వ్యాపారి అడ్డుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న వివాదం కారణంగానే అధికారులపై బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. బెదిరింపుల విషయమై కొందరు సామాజిక మాధ్యమాల్లో ఎంపీవో, కార్యదర్శి, సిబ్బందికి మద్దతునిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పోస్టులు పెట్టడంతో వివాదం మరింత రాజుకుంది. ఈ విషయమై ఏడూళ్లబయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ స్పందించారు. అధికారులను బెదిరించడం విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని, జరిగిన ఘటనపై పూర్తి సమాచారం తెలిసేంత వరకు ఎవరూ తొందరపడి, అనవసర పోస్టులు పెట్టొదని సూచించారు. పనులను అడ్డుకున్న విషయంలో జరిగిన వివాదంపై పంచాయతీ కార్యదర్శి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఎంపీవోను వివరణ కోరగా వరుసగా రెండు రోజులు సెలవు కావడంతో సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

పినపాక ఎంపీవోపై బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని జానంపేట అంబేద్కర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అభివృద్ధి పనులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్న ఎంపీవోపై బెదిరించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ, జానంపేటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘం నాయకులు

28న గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ యజమానుల అసోసియేషన్ ఎన్నికలు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు8: ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి నీరళ్ల శ్రీనివాసరావు తెలిపారు. ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, వైస్ ప్రెసిడెంట్స్ 2, జాయింట్ సెక్రటరీ 2, ఈసీ మెంబర్స్ 5 కి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19, 20వ తేదీలలో నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల విత్‌డ్రాలు, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటన, 28న పోలింగ్, అదే రోజు సాయంత్రం ఫలితాలు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్ లిస్ట్ కావాలనుకునే వారు రూ.100 చెల్లించి తీసుకోవాలని తెలిపారు. ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్‌కు పోటీ చేసే అభ్యర్థులు రూ. 10వేలు, వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీకి పోటీ చేసే అభ్యర్థులు రూ.8వేలు, ఈసీ మెంబర్లకు రూ.4 వేల చొప్పున ఒక్కొక్కరు చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

దివ్యాంగులకు ప్రభుత్వాలు అండగా నిలవాలి

» అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు8: దివ్యాంగులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జీ మారగాని శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని సిద్దారంలోని నూతనంగా ఏర్పాటుచేసిన స్వర్ణిక ఛారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవా ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. న్యాయాధికారి ఎం.శ్రీనివాస్ కుమారుడు శశాంక్ పుట్టిన రోజు వేడుకలను ఆశ్రమంలోని చిన్నారుల మధ్య జరుపుకున్నారు. ఆశ్రమం అభివృద్ధికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపకరణాలు, సహాయ పరికరాలును రాయితీపై గానీ, ఉచితంగా కానీ పంపిణీ చేయాలని కోరారు. దివ్యాంగులు అందుబాటులోని సంక్షేమ పథకాలు, చట్టాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వలపర్ల రవికుమార్, కోర్టు సూపరింటెండెంట్ బోయినపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస్

13న అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు7: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్- 14, 16, 18, 20 బాలురు, బాలికల అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిం చనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.

జూబ్లీక్లబ్ ఎన్నికలు వాయిదా

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు 7: భారీ వర్షాలు, వరదల కారణంగా ఈనెల 22న నిర్వహించతలపెట్టిన జూబ్లీక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు జూబ్లీక్లబ్ ఎన్నికల అధికారి ఎడ్లపల్లి రమేష్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

చెరువుల గండ్లు పూడ్చివేత


చెరువు కట్టపై రైతులు పూడ్చిన గండిని పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు, సెప్టెంబరు 8 తుఫాన్‌తో వరదనీటి ఉధృతి ప్రభావంతో కల్లూరు మండల పరిధిలో గల చెన్నూరులోని కొత్తకుంట చెరువు, యర్రబోయినపల్లి గ్రామంలో బసవన్న చెరువు కట్టపైన గల తూము వద్ద పడిన గండి, బుంగను ఆదివారం జలవనరులశాఖ కల్లూరు డివిజన్ స్థాయి అధికారుల పర్యవేక్షణలో తాత్కాలికంగా పూడ్చివేశారు. చెన్నూరులో కొత్తకుంట చెరువుపై ఆరు అడుగుల పొడవు, మీటరున్నర లోతు, ఎర్రబోయనపల్లిలో బసవన్న చెరువుపై తూము వద్ద ఇరువైపుల బుంగ పడటంతో పంచాయతీ కార్యదర్శి రైతులు అందించిన సమాచారంతో జనవరులశాఖ ఈఈ ఎం లక్ష్మీనారాయణ, డీఈ వెంకటేశ్వరరావు, జేఈలు పద్మరాజు, సాయి క్షేత్రస్థాయిలో సందర్శించి పర్యవేక్షణ చేస్తూ వాటిని తాత్కాలికంగా పూడ్చివేయించారు. చెన్నూరులో మాత్రం రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గండిని పూడ్చివేశారు.

నాగలవంచ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం

» బండి రేవు అప్రోచ్ రోడ్డుపై బుంగ
» ఇబ్బందులు పడిన వాహనదారులు

చింతకాని, సెప్టెంబరు 8: బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి పనుల్లో నాణ్యత కొరవడింది. మండల పరిధిలోని నాగులవంచ గ్రామ సమీపంలోని బండి రేవుపై గత కొన్ని నెలలుగా బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వాహనాల రాకపోకలకు అనువుగా సదరు కాంట్రాక్టర్ అప్రోచ్ రోడ్డు నిర్మించాడు. వారం రోజుల క్రితం భారీ వర్షాల కారణంగా అప్రోచ్ రోడ్డు కొట్టుకుని పోవడంతో వాహన రాకపోకలు ఇబ్బందిగా మారాయి. దీంతో గ్రామస్థులు శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. అనంతరం కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా మరమ్మతు పనులు నిర్వహించారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. భారీ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ రహదారిలో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పటిష్ఠంగా ఉండాలని గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులు అనుమానించనట్లే ఆదివారం సాయంత్రం అప్రోచ్ రోడ్డుపై చప్టా వద్ద పెద్ద బుంగ పడింది. దీంతో ఖమ్మం- బోనకల్ రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బుంగ పడే కొద్ది సమయానికి ముందే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ ఈ రహదారి గుండా ప్రయాణించడం గమనార్హం. వాహన రాకపోకలు అధికంగా ఉండే ఈ రహదారి నిర్మాణంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


అప్రోచ్ రోడ్డుపై ఏర్పడిన బుంగ

క్రైం సమాచారం

వైద్యం వికటించి బాలుడి మృతి


సాయి(ఫైల్)

కొణిజర్ల, సెప్టెంబరు8: వైద్యం వికటించి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు కథ నం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రా నరసింహారావు, రాజ్యలక్ష్మీల కుమారుడు చిర్రా సాయి(13)కి రెండు రోజుల నుంచి జ్వరం రావడంతో, తల్లిదండ్రులు స్థానిక ఆర్ఎంపీ ద్వారా వైద్యం చేపిస్తున్నారు. సదరు ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వలనే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు బోరున విలపించారు. ఇంజక్షన్ వికటించి ఉంటుందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై కొణిజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేష్‌ను సంప్రదించగా వైద్యం వికటించి ఉండవచ్చని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..


సందీప్(ఫైల్)

దుమ్ముగూడెం సెప్టెంబరు 8: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గంగోలు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగోలుకు చెందిన తాపీ మేస్త్రీ కుసిని సందీప్(36) ఈనెల 3న రాత్రి సమయంలో ఆటో నడుపుతూ డబ్ల్యూఎల్ రేగుబల్లి వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ప్రమాదానికి గురయ్యాడు. లక్ష్మీనగరానికి చెందిన కటుకూరి చంద్రమౌళి తన ఆటోను అతివేగం, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న సందీప్ ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ ను భద్రాచలం తరలించారు. అనంతరం హైదరాబాద్ తరలించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి మేనమామ బర్ల రవి ఫిర్యాదు మేరకు ఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు..

ఎర్రుపాలెం, సెప్టెంబరు8: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరెడ్ల నాగకార్తీక్‌రెడ్డి (17) తమ కోళ్లఫారం షెడ్డులో శనివారం సాయంత్రం సమయంలో విద్యుత్ బల్బులు వేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో స్విచ్ బోర్డు తడిచి ఉండడతో ప్రమాదవశాత్తూ కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి నాగమల్లేశ్వరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

పెనుబల్లి, సెప్టెంబరు 8 విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని అడవిమల్లేల గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అడవిమల్లేల గ్రామంలో ఆగ్రోస్ మొక్కజొన్న విత్తన తయారీ కేంద్రంలో గత పదేళ్లుగా కోటగిరి సత్యనారాయణ, సత్యవతి (60) దంపతులు కాపలాగా ఉంటున్నారు. కాగా గత నాలుగు నెలలుగా ఫ్యాక్టరీ పనిచేయడం లేదు. ఆదివారం వారు నివాసం ఉంటున్న ఇనుప రేకుల షెడ్డుకు విద్యుత్ ప్రసారం కావడంతో వంట చేసేందుకు వెళ్లిన ఆమెకు విద్యుత్ షాక్‌కు గురయి అక్కడికక్కడే మృతి చెందింది. గత కొంత కాలంగా విద్యుత్ మరమ్మత్తులు చేయాలని తాము యాజమాన్యం వారికి తెలిపినా పట్టించుకోలేదని భర్త సత్యనారాయణ వాపోయాడు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు వీఎం బంజరు ఎస్ఐ ఎన్. వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సత్యనారాయణ దంపతులు పదేళ్ల క్రింతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లి నుంచి వచ్చి మండల పరిధిలోని బయ్యాన్నగూడెంలో నివాసం ఉంటున్నారు.

ఆకెళ్ల జగన్నాథం కన్నుమూత


జగన్నాథం(ఫైల్)

భద్రాచలం, సెప్టెంబరు 8: భద్రాచలంలో శనివారం ఆకెళ్ల జగన్నాథం మాష్టార్ (66) అనారోగ్యంతో మృతి చెందారు. భద్రాచలంలో సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆయన ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. పలువురు విద్యార్థులు, నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

చింతకాని, సెప్టెంబరు 8: చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతైన సంఘటన మండల పరిధిలోని జగన్నాథపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన పిల్లి వీరస్వామి (58) గ్రామ సమీపంలోని తుమ్మలమ్మ చెరువుకు చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలు జారీ చెరువులో పడ్డాడు. సమీపంలో ఉన్న వారు గుర్తించి గ్రామస్థుల సహకారంతో గాలించిన అతడి లభించకపోవడంతో ఎన్‌డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

బూర్గంపాడు, సెప్టెంబరు 8: బూర్గంపాడు మండల పరిధిలోని పాత సారపాకకు చెందిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారున. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సారపాకకు చెందిన ష్యాగుప్తా అనే మహిళ అదే గ్రామానికి చెందిన బుయ్యన శంకర్ అనే వ్యక్తిని 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. శంకర్ ఐటీసీ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. ష్యాగుప్తా భద్రాచలంలోని ఓ ఆటో షోరూంలో పని చేస్తుంది. కాగా శనివారం ఇంటి నుంచి విధులకు వెళ్లిన ఆమె సాయంత్రానికి ఇంటికి తిరిగి రాలేదు.. కాగా భర్త శంకర్ ఫోన్‌కు హైదారాబాద్ వెళ్తున్నట్లు మేసేజ్ రావడంతో అతడిపాటు కుటుంబ సభ్యులు చుట్టూ పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ తమ్ముడు షేక్ సయ్యద్ అన్వర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నివారణ కోసం తనిఖీలు

మణుగూరు సెప్టెంబరు8: మణుగూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో గంజాయి అన్వేషణ కోసం పోలీసులు సోదాలు నిర్వహించారు. మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు మణుగూరు సీఐ సతీష్‌కుమార్ గంజాయి నివారణ కోసం అన్వేషణలు సాగించారు. పట్టణంలోని అనుమానిత ప్రాంతాల్లో, బస్టాండ్ పరిసరాల్లో నార్కోడి డాగ్‌తో సిబ్బంది పరిశీలనలు జరిపించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ మేడ ప్రసాద్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చంద్రుగొండ, సెప్టెంబరు8: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామం వద్ద శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన ఇనుమల నాగేశ్వరావు, ఇనుమల రాము ఇరువు కలిసి మండలంలోని రేపల్లేవాడలో మేకను కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా, మార్గమధ్యలోని తిప్పనపల్లి వద్ద జాతీయ రహదారి పైకి వస్తుండగా చంద్రుగొండ వైపు నుంచి వెళుతున్న బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఇరువురిని కొత్తగూడెం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. కాగా గాయపడ్డ వారిలో నాగేశ్వరావు పరిస్థితి విషమంగా ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ, సెప్టెంబరు 8: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పాల్వంచ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం అల్లూరిసెంటర్‌లో రేషన్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారం మేరకు జర్పుల శ్రీను అనే వ్యక్తికి చెందిన రేకుల షెడ్డులో పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్రమంగా షెడ్డులో నిల్వ చేసిన 66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

రఘునాథపాలెం ఎన్‌కౌంటర్ సంఘటనా స్థలం పరిశీలన


ఎన్‌కౌంటర్ స్థలాన్ని పరిశీలిస్తున్న దర్యాప్తు అధికారి శివం ఉపాధ్యాయ

కరకగూడెం, సెప్టెంబరు8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం మోతే అడవిలో 5వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్ ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారి, ఏటూర్‌నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ శనివారం పరిశీలించారు. ఎన్‌కౌంటర్ జరిగిన తీరును ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్ఐ రాజేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని, పరిసరాలను, మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న స్థావరాలను, మావోయిస్టులు మృతి చెందిన ప్రదేశాలను పరిశీలించారు. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన వివరాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం, ఏడూళ్ల బయ్యారం ఎస్ఐలు రాజేందర్, రాజ్ కుమార్, గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, సెప్టెంబరు 8: జిల్లా యంత్రాంగం సూజనలు పాటిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. ఆదివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేసారు. వరదనీటితో ప్రమాదకరంగా మారిన రోడ్లను దాటడానికి ప్రయత్నం చేయవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు, చెరువుల వద్దకు చూడటానికి వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని తెలిపారు. వర్షాలు తగ్గే వరకు వ్యవసాయ పనులకు, పశువులను కాయడానికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఇతర శాఖల సమన్వయంతో జిల్లా పోలీస్‌శాఖ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని, అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వెంటనే 100కు ఫోన్ చేయాలని ఎస్పీ కోరారు.

భక్తిప్రపత్తులతో వినాయక చవితి

వాడవాడలా పందిళ్ల ఏర్పాటు

మండపాల్లో విశేష పూజలు చేసిన ఎమ్మెల్యేలు

పలు ఆలయాల్లో విశేష పూజలు

వినాయక చవితి పండుగను శనివారం జిల్లా ప్రజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించుకున్నారు. వాడవాడనా మండపాలు ఏర్పాటుచేసి గణపయ్యను ప్రతిష్ఠించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు పలు చోట్ల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. పలు ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే దంపతులు



గణేష్ టెంపుల్ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



మణుగూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



చంద్రుగొండలో పూజలు



దమ్మపేటలో..



దుమ్ముగూడెంలో పూజలు



జూలూరుపాడు మండలం అనంతారంలో



పూజల్లో పాల్గొన్న పీవో దంపతులు



కొత్తగూడెం గాజులరాజం బస్తీలో



కొత్తగూడెం క్లాత్ మర్చంట్స్ బిల్డింగ్ వద్ద..



పాల్వంచ వెంకటేశ్వర కాలనీ



పాల్వంచలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని



అశ్వాపురం మండలం చవిటిగూడెంలో..



'పేట' లక్ష్మీగణపతి ఆలయంలో..

భారీ వర్షం.. పొంగిన వాగులు

స్తంభించిన రాకపోకలు.. నీటమునిగిన పంటలు.. ఆందోళనలో రైతన్న



పడమట నర్సాపురంలో నీట మునిగిన బెండ తోట

జూలూరుపాడు, సెప్టెంబరు 8: మండలంలో ఆదివారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల మధ్య వాగులు పొంగి ప్రవహించాయి. కొన్ని గంటల పాటు ప్రజల రాకపోకలు స్తంభించాయి. పత్తి, మిరప, కూరగాయాలు, బంతి తోటలు నీట మునిగాయి. మండలంలోని పడమటనర్సాపురం-బేతాళపాడు గ్రామాల మధ్య గల తుమ్మలవాగు, పెద్దవాగు, అన్నారపాడు- గుండ్లరేవు గ్రామాల మధ్య గల అలుగువాగు, కాకర్ల-అనంతారం గ్రామాల మధ్య ఉన్న ఎర్రవాగు, గురవాగుతండాలోని ఎదళ్లవాగు చెక్‌డ్యాంలు పొంగి పొర్లాయి. చింతల తండా, రాంపురం గ్రామాల్లో ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు. వరుసగా రెండో రోజు మండలంలో భారీ వర్షం కురిసి వాగులు పొంగడంతో జన జీవనం స్తంభించింది. వరుస వర్షాలతో పంటలు నీట మునిగి మొక్కలు కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇల్లెందులో భారీ వర్షం

ఇల్లెందుటౌన్: ఇల్లెందులో ఆదివారం భారీ వర్షం కురిసింది. వర్ష ప్రభావంతో సింగరేణి జేకే5 ఓసీలో ఓబీ పనులు నిలిచిపోయాయి. వర్షానికి ఇల్లందులపాడు మంచినీటి చెరువు అలుగు పోయడంతో బుగ్గవాగు జోరుగా ప్రవహించింది. అదేవిధంగా కోయగూడెం ఓసీలో వర్షం కురవడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలు కురుస్తున్నందున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు కోరారు.

పొంగిన వాగులు.. దెబ్బతిన్న రహదారులు

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడుతూనే ఉంది. ఊట్లపల్లి, వినాయకపురం, మల్లాయిగూడెం, పాపిడిగూడెం ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం ఆకాశానికి చిల్లు పడిందా అనే రీతిగా ఊహించని విధంగా వర్షం పడింది. ఆయా గ్రామాల్లో రహదారులు చెరువులను తలపించేలా వరద పారింది. రహదారులపై ఎక్కడ చూసినా వరదనీటి ప్రవాహమే. మల్లాయిగూడెంలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదలకు వాగులు పొంగి ప్రవహించాయి. వాగోడ్డుగూడెం సమీపంలో వాగులు పొంగటంతో అనంతారం మార్గంలో రాకపోకలు రెండు రోజులుగా నిలిచిపోయాయి. చెరువులు అలుగులు ఉధృతంగా పారుతున్నాయి. గతంలో నారంవారిగూడెం నుంచి గుర్రాలచెరువు వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురికాగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. తిరిగి అదే ప్రదేశంలో రోడ్డు చాలా వరకు కొట్టుకుపోయింది. మండల సరిహద్దులోని గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లే దారిలో వాగులు పొంగటంతో ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనేక గ్రామాల్లో పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. కొంతసేపు కూడా తెరపినివ్వకపోటంతో ప్రజలు కూడా బయటకు రాలేని పరిస్థితి. వరదలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో ప్రజాజీవనం పూర్తిగా దెబ్బతిన్నది. మరో రెండు రోజులు కూడా వర్షాలు చెప్పటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి చంద్రుగొండ మండలంలో అత్యధికం..

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: ఉమ్మడి చంద్రుగొండ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదయింది. అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెట్లం గ్రామంలో 98.0 మిల్లీ మీటర్లు, చంద్రుగొండ మండలలోని మద్దుకూరు గ్రామంలో 93.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు అయినట్లు అదివారం అధికారులు తెలిపారు. కాగా చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు గ్రామం వద్ద డ్రైనేజీ పొంగి జాతీయరహదారిపై వరద పొంగి ప్రవహించింది. సీతాయిగూడెం వద్ద ఎదుళ్లవాగుతో పాటు బాల్యాతండా, రేపల్లేవాడ, అన్నారంతండా వద్ద వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చంద్రుగొండ శివారు ఉత్తరపొంటి కాలనీవద్ద పొలాల్లోకి వెళ్లే రహదారి వరద ప్రవాహానికి కోతకు గురైయింది. అన్నపురెడ్డిపల్లి మండలంలోని పలువాగులు పొంగి ప్రహిస్తుండటంతో డీఎస్పీ రెహమాన్ పరిస్థితిని పరిశీలించారు.



'పేట' మండలం వాగొడ్డుగూడెం వద్ద పొంగిన వాగు



మూసివేసిన గుబ్బలమంగమ్మ ఆలయం

పిచ్చయ్య మృతదేహం వద్ద ఎమ్మెల్యే నివాళులు

భద్రాచలం, సెప్టెంబరు 8: ప్రభుత్వ ఉపాధ్యాయుడు చీమల పిచ్చయ్య భద్రాచలంలోని తన స్వగృహంలో ఆదివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆయన మృతదేహం వద్ద నివాళ్లర్పించారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, నాయకురాలు ఇర్పా అనసూయలు కూడా నివాళ్లర్పించారు.

భద్రాద్రి వద్ద తగ్గుతున్న గోదావరి నీటిమట్టం

భద్రాచలం, సెప్టెంబరు 8: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది. శనివారం సాయంత్రం 31.9 అడుగులున్న గోదావరి నీటిమట్టం ఆదివారం ఉదయం 9 గంటలకు 28.9 అడుగులకు తగ్గింది. 12 గంటలకు 28.4 అడుగులు, 3 గంటలకు 27.5 అడుగులు, 6 గంటలకు 26.7 అడుగులకు తగ్గింది. రాబోయే 24 గంటల్లో మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వెంకటసుబ్బమ్మకు ఎమ్మెల్యే పాయం నివాళి

అశ్వాపురం, సెప్టెంబరు 8: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన వాస్తు సిద్ధాంతి పదిరావూరి శ్రీనివాసచారి మాతృమూర్తి వెంకటసుబ్బమ్మకు ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. వెంకటసుబ్బమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు.

మెరుగైన సేవలకు కృషి: ఎస్ఈ

కొత్తగూడెం, సెప్టెంబరు 8: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ విద్యుత్ వినయోగదారులకు మరింత మెరుగైన సేవలందించడానికి కట్టుబడి ఉందని, సేవలు అందించే క్రమంలో సంస్థ సిబ్బంది వినయోగదారులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే ఉపేక్షించబోమని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మహేందర్ అన్నారు. ఆదివారం ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేసారు. సంస్థలో అవినీత నిర్మూలనకై ప్రత్యేక దృష్టి సారించామని, అధికారులు, సిబ్బంది లంచం అడిగితే విజిలెన్స్ వింగ్ ఆధ్వర్యంలో పర్యవేక్షించబడుతున్న 9281033233. అవినీతి నిరోధకశాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 1064 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. సంస్థ పరిధిలో వినియోగదారులకు ఉత్తమమైన సేవల్లో భాగంగా సిటిజన్ చార్టర్‌కు లోబడి సేవలందించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి గ్రీవెన్స్ పోర్టల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. లంచం ఇవ్వకండి- మాకు సమాచారం ఇవ్వండి అని సూచించే పోస్టర్లను 16 సర్కిళ్ల పరిధిలోని అన్ని కార్యాలయాలు, సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన

వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బూర్గంపాడు, సెప్టెంబరు 8: బూర్గంపాడు మండల పరిధిలో ఆదివారం పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు విస్తృత పర్యటన చేశారు. పర్యటనలో భాగంగా సారపాకలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బూర్గంపాడు మండల పరిధిలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఇటీవల పాల్వంచ మండల పరిధిలోని దంతెలబోరు సమీపంలో కిన్నెరసాని వాగు ఉధృతికి గల్లంతయిన ఉప్పుసాక గ్రామానికి చెందిన జారె సాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాయం పరామర్శించారు. కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఉప్పుసాక-పినపాక పట్టీనగర్ గ్రామాల మధ్య భారీ వర్షాలకు కొతకు గురయిన రహదారిని పరిశీలించి త్వరితగతిన మరమ్మతులు చేయాలని ఆధికారులను ఆదేశించారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

టీవీఆర్ చంద్రంకు ఘన నివాళి

భద్రాచలం, సెప్టెంబరు 8: సమస్యలపై ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలను బలోపేతం చేయడమే అమరజీవి టీవీఆర్ చంద్రంకు మనమిచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. టీవీఆర్ చంద్రం 28వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ పెట్టిన సమయంలో టీవీఆర్ చంద్రం, బండారు చందర్‌రావుపై కనిపిస్తే కాల్చివేత ఆదేశాలు జారీ చేశారని, రహస్య జీవితాన్ని గడిపారన్నారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని ప్రజా ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఎన్ని అడ్డకుంలు కల్పించినా, ప్రజా సమస్యలే పరమావధిగా జీవనం సాగించారి గుర్తు చేశారు. ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించడంతోపాటు. ప్రజలను భాగస్వాములను చేయడంలో సఫలీకృతులు అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు శరత్‌బాబు, గడ్డం స్వామి, ఎంవిఎస్ నారాయణ, నకిరికంటి నాగరాజు, కుంజా శ్రీనివాస్, సంద్ర భూపేంద్ర, అన్వేష్, రాయల రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్ రద్దు: కలెక్టర్

కొత్తగూడెం, సెప్టెంబరు 8: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా వాతావరణశాఖ ఆరెంజ్ ఎలర్ట్ జిల్లాకు ఇవ్వడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆయన ఓ వీడియో సందేశం విడుదల చేసారు. ఆరంజ్ ఎలర్ట్‌లో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్లపైనుంచి వర్షం నీరు పారుతుంటే అధికారులకు సమాచారం అందించాలన్నారు. అదే విధంగా వాగులు, లో లెవెల్ చెప్టాలు దాటే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. ప్రభుత్వ ఏర్పాటు చేసే పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ కోరారు.

'నాలా కబ్జాలను తొలగించాలి'

సుజాతనగర్, సెప్టెంబరు 8: సుజాతనగర్ మండకేంద్రంలో నాలా కబ్జాలను వెంటనే తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిలిచిన మురుగునీటిని సీపీఎం బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సుజాతనగర్‌లో సైడ్ డ్రైన్లు సరిగా లేవని, నాలాలు కబ్జాకు గురయ్యాయని, వీటి కారణంగానే మండల కేంద్రంలో నీరు నిల్వ ఉండి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్రా శివరామకృష్ణ, నల్లగోపు పుల్లయ్య, బచ్చలకూర శ్రీను, తిరుపతిరావు, కొండె కృష్ణ, కుంచం రాంబాబు, చల్లా ఏడుకొండలు, సట్టు తిరపాల్, చింతాల శ్రీను, వీర్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైతులందరికీరుణమాఫీ చేయాలి'

కరకగూడెం, సెప్టెంబరు 8: అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని రేషన్ కార్డు లాంటి కొర్రీలు లేకుండా రైతులందరికి తక్షణమే రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నిమ్మల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని భట్టుపల్లి గ్రామంలో మండల కమిటీ అధ్యక్షుడు ఊకె నరసింహారావు ఆధ్యక్షతన సమావేశం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి కొమరం కాంతారావు, మండల కమిటీ సభ్యులు నరసింహారావు, చర్ప సత్యం, బిలపాటి శంకరయ్య, కణితి రాము పాల్గొన్నారు.

ఫొటో గ్రాఫర్లకు నగదు, బియ్యం అందజేత

మణుగూరు సెప్టెంబరు 8: మణుగూరు మండలంలో వరదల వల్ల నష్టపోయిన ఫోటో గ్రాఫర్లకు లక్షా పదివేల ఆర్థిక సాయాన్ని ఆదివారం జిల్లా ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు అందించారు. ఒక్కో ఫోటో గ్రాఫర్‌కు 26వేల రూపాయల ఆర్థిక సాయంతోపాటు 25 కేజీల బియ్యాన్ని వితరణగా అసోసియేషన్ అధ్యక్షుడు కీసర సుదాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ జిల్లా కన్వీనర్ పంపన రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా కీసర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఫోటో గ్రాఫర్లను ఆదుకునేందుకు రాష్ట్ర ఆసోసిసయేష్, నల్గొండ, కరీంనగర్, సూర్యపేట జిల్లాల అసోసియేషన్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మణుగూరు మండల నాయకులు వన్నం కృష్ణమోహన్, గాజుల పూర్ణచందర్‌రావు, పుసులూరి శ్రీనివాస్, శ్రీనివాస్, రామదాస్, శ్రీహరి, జేమ్స్, ఆనంద్, ఈరెల్లి సురేష్, ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిపాడు చప్టాను పరిశీలించిన సీఐ

ములకలపల్లి, సెప్టెంబరు 8: రెండు రోజులుగా కురుస్తున వర్షాలకు ములకలపల్లి మండలంలో వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాపరాలపల్లి నుండి కుమ్మరిపాడులో మధ్యలో వున్న లోలెవల్ వంతెనపై వరదనీరు ప్రవహించటంతో తాళ్ళపాయితో పాటు పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ సీఐ వినయ్ కుమార్ వరద నీరు ప్రహిస్తున్న చప్టాను పరిశీలించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

పాల్వంచటౌన్, సెప్టెంబరు 8: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని, ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందజేసి అండగా నిలబడుతుందని అన్నారు. వ్యవసాయశాఖ అధికారులకు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటనష్టం వివరాలను అందించాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. గత ప్రభుత్వం పంటనష్టపోయిన రైతులను ఆదుకున్న పాపాన పోలేదని విమర్శించారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున నష్టపరిహారం అందజేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివాసముండేవారికి పునరావాసం కావాలంటే సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల దృష్టికి తీసుకెళ్ళి స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్లతో మాట్లాడి నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇంటిపథకం క్రింద రూ. 5లక్షలు ఇప్పిస్తామని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, నాయకులు భట్టు మురళి, సాంబయ్య, ఇమ్మాన్యుయేల్, బొల్లం ఉదయ్‌కుమార్, భార్గవ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగ సీతారాములు

ఓయూ విద్యార్థి జేఏసీ దీక్ష

భద్రాచలం, సెప్టెంబరు 8: ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని కోరుతూ ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ దీక్ష ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన సమస్యలను తీర్చేందుకు భద్రాచలం ముంపు మండలాలను ఆంధ్రాకు అప్పగించిన సమయంలో ఉత్పన్నమైన సమస్యగా ఈ ఐదు పంచాయతీల సమస్యలను గుర్తించి తక్షణమే ఈ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని కోరారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నక్క రత్నకుమారి, నక్క శాంతికుమార్, నాగళ్ల పద్మ, గోపి జంపన్న, సాంబ, బాష పోశయ్య, కందుకూరి విజయలక్ష్మి, రమేష్, భీక్షం పాల్గొన్నారు.